ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



'స్థానికం'పై ఆశలు

- సీఎం రేవంత్ తాజా ప్రకటనతో ఆశావహుల ప్రయత్నాలు
- ప్రస్తుత పంచాయతీ రిజర్వేషన్లపై సర్కారు పునరాలోచన
- సంక్షేమ పథకాలు చేరవేత, చేరికలపై కసరత్తు
- స్థానిక సంస్థల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు
- ఇప్పటికే ప్రత్యేక పాలనలోకి పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు

పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలపై స్పష్టత కోసం ఎదురుచూపు

హనుమకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహిస్తామని పాలమూరు సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఎన్నికల నిర్వహించే సమయంపై స్పష్టత రాకపోవడంతో వారంతా సర్కారు ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. గత ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీ కాలం ముగిసింది. జూలై 4వ తేదీతో జిల్లా, మండల పరిషత్ ఛైర్మన్ల పదవీ కాలం ముగిసింది. దీంతో ఇవి ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లాయి. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఆ దిశగా అధికారులకు కూడా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. కిందటిసారి ఎన్నికలు జరిగినప్పుడు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు కొనసాగాలని చట్టాన్ని తీసుకువచ్చింది. దీనిపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ కనిపిస్తుండగా.. పాలమూరు సభలో సీఎం చేసిన ప్రకటన నేపథ్యంలో యంత్రాంగం కూడా త్వరలోనే గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల నిర్వహించేందుకు కసరత్తు ప్రారంభించబోతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ తరపున రంగంలోకి దిగాలనుకుంటున్న స్థానిక నేతలు తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు.



సంక్షేమ పథకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలే అయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. దీంతో కోడ్ అమలులోకి రావడంతో పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంక్షేమ పథకాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. వాటి ఫలాలు క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణులకు పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఆరు గ్యారంటీల కింద చేపట్టిన సంక్షేమ పథకాలు కూడా పూర్తిగా అమలులోకి రాలేదు. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికలకన్నా ముందే పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

కానీ లోక్‌సభ ఎన్నికల వల్ల వీటి నిర్వహణ ఆలస్యమైంది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికలపై దృష్టి సారించే విషయంలో ప్రభుత్వం అంతసానుకూలంగా లేదని, పరిపాలన ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నందు వల్ల ఎన్నికలకు ఇంకా సమయం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ సీఎం రేవంత్ మాత్రం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడంతోపాటు, వారిలో నిరాశ ఆవహించకుండా ఉండేందుకు త్వరలోనే ఎన్నికల నిర్వహణ ఉంటుందని ప్రకటించారన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలల తర్వాతే స్థానిక, ప్రాదేశిక సంస్థల ఎన్నికలు ఒకదాని తర్వాత ఒకటిగా వరుసగా నిర్వహిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ, 1,030 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 7 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు జిల్లాల పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర, పరకాల, నడికూడ ఈ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీంతో హనుమకొండ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరగనున్నది. జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 86 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా పరిధిలో ప్రస్తుతం 16 జడ్పీటీసీలు ఉన్నాయి. ఏడాది కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి వచ్చి చేరాయి. దీంతో ఈ జిల్లాలో మొత్తం జడ్పీటీసీల సంఖ్య 18కి చేరనున్నది. ఎంపీసీ స్థానాలు 198 ఉన్నాయి. జనగామ జిల్లాలో 12 జడ్పీటీసీలు, 141 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం 11 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. కొంతకాలం కిందట పునర్విభజనతో గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరనున్నది. ఎంపీటీసీ స్థానాలు 106 ఉన్నాయి. ములుగు జిల్లాలో 9 జడ్పీటీసీలు ఉన్నాయి. ఎంపీటీసీలు 87. వరంగల్ జిల్లాలో 16 జడ్పీటీసీలు, 412 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి.

ఆరు నెలల తర్వాత..

మొన్నటివరకు మెజారిటీ జిల్లా పరిషత్, మండల పరిషత్తు ఛైర్మన్ పదవులు బీఆర్ఎస్ చేతిలో ఉన్నాయి. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జడ్పీ ఛైర్మన్లుగా బీఆర్ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. జడ్పీటీసీ సభ్యులు కూడా ఆ పార్టీ పక్షాన ఎక్కువ మంది గెలిచారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల క్రమంలో కొన్ని జిల్లాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. పదవులపై ఆశలు పెట్టుకున్న చాలామంది నేతలు.. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటికే ఆ పార్టీలో ఉన్న పాత నేతలు సైతం పదవులపై ఆశలు పెంచుకున్నారు. ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు ప్రాదేశిక ఎన్నికలు నిర్వహిస్తే టికెట్ల కేటాయింపు వంటి పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి ఒకింత ఇబ్బంది తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మెజారిటీ స్థానాలను గెలుచుకునే అవకాశాలు అంతగా లేవు. పరోక్షంగా బీఆర్ఎస్‌కే లాభపడే అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు బీజేపీ కూడా జోరుమీద ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ అధినాయత్వం పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ 30 శాతం వరకు పెరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో సైతం ఇదే ట్రెండ్ కొనసాగింది. ఈ పరిస్థితుల్లో ప్రాదేశిక ఎన్నికలకు ఇప్పటికిప్పుడు పోకపోవడమే మంచిదనే అభిప్రాయంలో కాంగ్రెస్ అధినాయకత్వం ఉంది.

వేచి చూడాల్సిందేనా?

తమ పదవులు కొనసాగిస్తారనే ఆశ కొందరిలో ఉంది. కానీ కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు మాత్రం ప్రత్యేకాధికారులను తమకు అనుకూలంగా మలచుకొని స్థానిక, ప్రాదేశిక సంస్థల్లో పాగా వేయాలని భావిస్తున్నారు. ఈ లోగా జడ్పీ, మండల పరిషత్తు ఛైర్మన్లలో చాలామంది కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక, ప్రాదేశిక ఎన్నికల అంశాన్ని అక్టోబరు వరకు వేచి చూసే ధోరణిలో ఉండే అవకాశం లేకపోలేదు. మరో వైపు ముఖ్యమంత్రి కూడా జిల్లాల పర్యటన చేపట్టి పార్టీని పటిష్టం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో కలిసి సమీక్షలు నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారు.

భూసేకరణలో బాధితులకు పరిహారం చెల్లించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారదాదేవి, అదనపు కలెక్టర్, డీఎఫ్‌వో

వరంగల్ కలెక్టరేట్, జూలై 10: రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణలో బాధితులకు చెల్లించే పరిహారం విషయంలో మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిలతో కలిసి రీజినల్ రింగ్ రోడ్డు, మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ కారిడార్ భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి మాట్లాడుతూ మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ కారిడార్ వరంగల్ జిల్లాలో 38.2 కిలోమీటర్ల మేర రహదారి వెళుతున్నదని తెలిపారు. అందులో 160 హెక్టార్లకు భూసేకరణ చేసి అవార్డులు పాస్ చేసి 168 మంది లబ్ధిదారులకు రూ.10.38 కోట్లు పరిహారం అందించి భూములు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ధరల వ్యత్యాసం వల్ల మిగిలిన రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. ధరల హెచ్చింపు విషయంలో మెగా టెక్స్‌టైల్ పార్కు భూసేకరణ, రైల్వేకు సంబంధించిన ధరలను పరిగణలోకి తీసుకొని ఇదివరకే పరకాల ఎమ్మెల్యే, భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులతో కలిసి రైతులతో చర్చించినట్లు వివరించారు. మరోమారు రైతులతో చర్చించి ఈనెలాఖరులోగా భూసేకరణ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్, ఆర్డీవో కృష్ణవేణి, పర్యవేక్షకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హత్యా రాజకీయాలు చేస్తోంది

- వారి ప్రభుత్వం వచ్చాక హత్యలు పెరిగాయి
- దేవేందర్‌ను హతమార్చిన నిందితులను శిక్షించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవేందర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దయాకర్‌రావు

రాయపర్తి, జూలై 10 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్యలు పెరిగాయని, మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మండలంలోని బురహాన్‌పెల్లి గ్రామంలో దేవేందర్ ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈనెల 7న దేవేందర్ హత్యకు గురికాగా, కుటుంబసభ్యులు అమెరికా నుంచి రావడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ హత్యకు కారణమైన నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. అనంతరం మండలంలోని పోతురెడ్డిపెల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు చెంగల ఇందిర సోదరి నిర్మల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, నయీం, రంగయ్య తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చడంలో సర్కారు విఫలం

- రైతులకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్
- కలెక్టరేట్ ఎదుట కిసాన్ మోర్చా రైతు సత్యాగ్రహ దీక్ష



దీక్షలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్

వరంగల్ కలెక్టరేట్, జూలై 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి అధ్యక్షతన రైతు సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ, కౌలు రైతులకు ఎకరాకు రూ.15వేలు, వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్, అన్ని పంటలకు మద్దతు ధర, పసల్‌బీమా ఇలా రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి రాగానే తుంగలో తొక్కిందన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పదేపదే చెప్పి వాటి ఊసెత్తడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే తమకు కష్టాలు మొదలయ్యాయని రైతులు మండిపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వపాలన, నిర్వహణ లోపం వల్లే సాగునీటి కొరత ఏర్పడిందని, పాలన చేతగాకపోతే గద్దె దిగిపోవాలని విమర్శించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పేరుతో దళితులను, గిరిజన బంధు పేరుతో గిరిజనులను మాయమాటలతో మోసం చేసిందని, ఏ వర్గానికి ఎలాంటి బంధు ఇవ్వలేదని రవికుమార్ అన్నారు. ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే సాగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఒక కుటుంబ పాలన పోయి మరొక కుటుంబ పాలన వచ్చిందన్నారు. ఒక వసూల రాజ్యం పోయి ఇంకో వసూల రాజ్యం వచ్చిందని ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని రవికుమార్ తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవోకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి శేషాద్రి, బీజేపీ నేత పగడాల కాళీప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయ చందర్‌రెడ్డి, రత్నం సతీష్‌షా, పార్లమెంట్ కోకన్వీనర్ అల్లం నాగరాజు, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, బాకం హరిశంకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర, జిల్లా, వివిధ మోర్చాల నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్లు

- జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ కలెక్టరేట్, జూలై 10 : స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందజేస్తున్న ప్రభుత్వం మహిళలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఆసక్తి గల మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నారు. 14 రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందులో మైక్రో ఎంటర్ ప్రైజెస్, కుట్టు కేంద్రాలు, పాడి గేదెలు, పెరటికోళ్ల పెంపకం, కోళ్ల ఫారం, సంచార చేపల ఔట్‌లెట్లు, పాల పార్లర్, మీసేవా కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, కస్టమర్ హైరింగ్ కేంద్రాలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆహార శుద్ధి యూనిట్లు, అద్దె వ్యవసాయ పరికరాల లాంటి యూనిట్లను నెలకొల్పవచ్చు.

జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. జనసంచారం ఎక్కువగా ఉండేప్రాంతాలను పరిశీలిస్తున్నారు. వరంగల్ బస్టాండ్, ఎంజీఎం ఆస్పత్రి, అజంజాహి మిల్లు ప్రాంతం, ఏనుమాముల మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు స్థల పరిశీలన చేశారు. మార్కెట్‌లోని పల్లి యార్డు సమీపంలోని గోదాము, మార్కెట్ కార్యాలయం పక్కనే ఉన్న క్యాంటీన్ స్థలాన్ని, అలాగే ప్రధాన ద్వారం వద్ద ఉన్న షెడ్డును పరిశీలించారు. ఏ స్థలమైతే క్యాంటీన్‌కు అనువుగా ఉంటుందో చర్యలు తీసుకోనున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కౌసల్యాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఐదు మహిళా శక్తి కేంద్రాల ఏర్పాటునకు చర్యలు చేపడుతున్నాం. స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకోవాలి. ఆసక్తి ఉన్న సంఘాలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

బేరుండా అలంకరణలో భద్రకాళి

- ఐదో రోజుకు చేరిన అమ్మవారి శాకంబరీ ఉత్సవాలు



కురుకుల్లా అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

వరంగల్ కల్చరల్, జూలై 10 : వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అమ్మవారి శాకంబరీ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలు బుధవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన, నీరాజన మంత్రపుష్పములతో పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో తిథిద్వయం కావడంతో అమ్మవారి దశ మహా విద్యలలోని కాళీ క్రమాన్ని అనుసరించి శోడశి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం వేళ కురుకుల్లా అలంకరణలో, సాయంత్రం బేరుండా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శాకంబరీ నవరాత్రి ఉత్సవాల్లో భద్రకాళి మాతను కురుకుల్లా, బేరుండా అలంకరణలో భక్తులు దర్శించుకుంటే పాపాలన్నీ తొలగిపోతాయని భద్రకాళి శేషు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఈవో శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా మైసమ్మ తల్లి బోనాలు

- వంచనగిరిలో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి కొండా సురేఖ



బంగారు బోనంతో ఆలయానికి వెళ్తున్న మంత్రి కొండా సురేఖ

గీసుగొండ, జూలై 10 : కొండా దంపతుల స్వగ్రామమైన గీసుగొండ మండలంలోని వంచనగిరిలో మైసమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ బోనాల వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి సురేఖ బంగారు బోనం ఎత్తుకొని గ్రామస్థులతో కలిసి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మైసమ్మ తల్లి ఆలయానికి కాలినడకన తరలి వెళ్లారు. అనంతరం అమ్మవార్లకు పట్నాలు వేసి బోనాలు సమర్పించి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి వద్ద గల కోటమైసమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. మంత్రి పదవి చేపట్టిన తరువాత కొండా సురేఖ కుటుంబసభ్యులతో స్వగ్రామానికి రావడంతో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తరలివచ్చి గజమాలతో వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతి, నందిరాంనాయక్, సీఐలు బాబులాల్, మల్లయ్య, గోపి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ నాయకులు గోపాల నవీన్‌రాజ్, రడం భరత్ కుమార్, మాజీ ఎంపీటీసీలు రజిత, వీరారావు, మాజీ సర్పంచ్ అనసూర్య, రాజు, గోదాసి సూరయ్య, బొల్లం శివ, కొమ్ముల కిశోర్‌కుమార్, కొండా వెంకన్న, శ్రీనివాస్, సింగరి రాజ్‌కుమార్, గాజర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు

- రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం



స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

నర్సంపేట టౌన్, జూలై 10 : నర్సంపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు షేక్ రహీంపాషా(44) హత్య కేసులో నలుగురు నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో టౌన్ సీఐ రమణమూర్తి నిందితుల అరెస్టు చూపి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దారంగుల ప్రవీణ్, బొంత రాజు, తాడెం పవన్, తాడెం శివకుమార్‌లు జులాయిగా తిరుగుతుండేవారు. ఇందులో ప్రవీణ్ గతంలో చైన్ స్నాచింగ్, చిన్నచిన్న నేరాలకు పాల్పడి జైలు జీవితం గడిపాడు. ఈ క్రమంలో ప్రవీణ్‌కు ఒంటరిగా ఉంటున్న రహీంపాషా ఇంటిపై కన్నుపడింది. రహీంపాషా ఇంట్లో దొంగతనానికి పాల్పడానికి ప్లాన్ వేసి తన మిత్రులైన రాజు, పవన్, శివకుమార్‌కు తెలిపారు. ఈనెల 6న అర్ధరాత్రి నలుగురు కలిసి రహీంపాషా ఇంటికి వెళ్లి తలుపు తట్టారు. ప్రవీణ్ తెలిసినవాడే అయినందున తలుపులు తీయగానే రహీంపాషా ముఖంపై వారు పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి చంపి ఇంటి ఆవరణలోని బావిలో పడేశారు. గుర్తుపట్టకుండా ఇంటిలోపల బురద చల్లి కిరాణం షాపులోని బీర్లు, మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు బుధవారం ఖానాపురం పాతబ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నారన్న సమాచారంతో పోలీసులు చేరుకుని దారంగుల ప్రవీణ్, బొంత రాజు, తాడెం పవన్, తాడెం శివకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన నర్సంపేట పోలీసులను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

పెద్దాస్పత్రిలో హృద్రోగులకు దిక్కెవరు?

కార్డియాలజిస్టులతో కొరతతో రోగులకు తప్పని అవస్థలు

పరీక్షలు చేసే వారు లేక నిరీక్షణ



గుండె పరీక్షలకోసం బారులు తీరిన రోగులు

వరంగల్ మెడికల్, జూలై 10: ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటికి పెద్దాస్పత్రి అయిన ఎంజీఎంలో కార్డియాలజీ విభాగం పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా ఉంది. ఈ విభాగంలో ఇద్దరే కార్డియాలజిస్టులు ఉన్నారు. వారూ సకాలంలో రారు. గుండె పరీక్షలు చేసే వైద్య పరికరాలు కూడా చాలినన్ని లేవు. గుండె పనితీరును గుర్తించడంలో కీలకంగా పని చేసే టూడీ ఎకో పరికరాలు రెండే ఉన్నాయి. ఎంజీఎంకు రోజు 100 నుంచి 150 మంది హృద్రోగులు గుండె పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. బుధవారం రోజు కూడా రోగులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కానీ కార్డియాలజీ డాక్టర్లే లేరు. దీంతో టూడీ ఎకో పరీక్షలు చేసేవారే లేకుండా పోయారు. టూడీ ఎకో పరీక్షలు నిలిచిపోవడంతో హృద్రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోగులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షల కోసం వార్డులో పడిగాపులు కాశారు. డాక్టర్ల జాడ లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు టూడీ ఎకో పరీక్షలకు కోసం రోగులను కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి పంపించారు. రోగులు అక్కడి వెళ్లే సరికి అప్పటికే అక్కడ కార్డియాలజీ విభాగంలో టూడీ పరీక్షల కోసం రోగులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ఎంజీఎం నుంచి కూడా రోగులు రావడంతో వార్డులో రద్దీ పెరిగింది.

ఇప్పటికే రోగులు పెద్ద సంఖ్యలో ఉండగా ఎంజీఎం నుంచి సైతం రిఫర్ చేయడంపై సూపర్‌స్పెషాలిటీలోని డాక్టర్లు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి పరీక్షలు చేయడానికి నిరాకరించారు. దీంతో ఇక్కడ కూడా డాక్టర్లకు, రోగుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. రోగులు, వారి వెంట వచ్చిన బంధువులు డాక్టర్లతో ఘర్షణకు దిగారు. అధికారుల తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆస్పత్రిలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి చేసేది లేక రోగులు టూడీ ఎకో పరీక్షలు చేయించుకోకుండానే నిరాశతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. రెండు రోజుల కిందటే వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రి పరిస్థితిపై ఆయా విభాగాల అధిపతులతో సమీక్షించారు. ఎంజీఎంలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అయినా పరిస్థితి మారలేదు.

నగర సమగ్రాభివృద్ధికి కృషి

వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై10: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలోని వరంగల్ నగరంతో పాటు 180 గ్రామాలను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి చేస్తానని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో స్థానిక సిబ్బందితో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకే నగరంలోని కాళోజీ కళాక్షేత్రం పనులు 70 శాతం పూర్తయ్యాయని, సెప్టెంబర్ 9 వరకు పనులు పూర్తి చేసి ప్రారంభ కార్యక్రమానికి సీఎం చేతులు మీదుగా ఆవిష్కరణ చేయిస్తామన్నారు. ఇంకా ఇన్నర్, ఔటర్ రింగు రోడ్డు పనులు త్వరిత గతిన పూర్తి చేస్తామని తెలిపారు. భూములు కోల్పోయిన యజమానులకు నష్టం జరుగకుండా పరిహారంతో ఆదుకుంటామన్నారు. ఇప్పటికే సీఎం నిధుల నుంచి రూ.350కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. నగరం చుట్టుపక్కల చాలా చోట్ల కుడాకు సంబంధించిన భూములు రియల్టర్లు ఆక్రమించుకున్నారని, సర్వే ద్వారా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకుంటామన్నారు.

వరంగల్ నగరం నుంచి ఇప్పటికే క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని, క్రీడారంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 50 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేసి అన్ని రకాల క్రీడలకు శిక్షణ ఇప్పిస్తామని ఇనగాల పేర్కొన్నారు. అక్కడక్కడా ఉన్న ఆస్పతుల ద్వారా ఇతర ప్రాంతాల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం కుడా నిధులతో ఒకే చోట మెడికల్ జోన్‌లు ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. కుడాకు జీడబ్ల్యుఎంసీ నుంచి అద్దెల ద్వారా రూ.50కోట్లు రావాలని, ఆ ఫండ్‌తో నగరాన్ని సుందరీకరిస్తామన్నారు. కుడా పరిధిలో చాలా చోట్ల అనుమతులు లేకుండా లేఔట్ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు కుడా వెబ్‌సైట్ మూతబడి ఉందని, దానిని పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఎల్ఆర్ఎస్ చెల్లింపులతో పాటు కుడా అభివృద్ధి పనుల డాటా నిక్షిప్తం చేయవచ్చని అన్నారు. ప్రస్తుతం కుడాలో సిబ్బంది తక్కువగా ఉన్నారని, త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు మరో 50 మంది సిబ్బందిని నియమిస్తామని వెల్లడించారు. కుడా అంటేనే ప్లాట్లు, డబ్బులు, లంచాలు, అక్రమాలు అనే ప్రచారం ఉందని, తమ హయాంలో ఎలాంటి అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలా తమ పాలన ఉండబోదని ప్రజలు గుర్తించాలని, సిబ్బంది సైతం తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

రూ.850 కోట్ల పనులకు ప్రతిపాదనలు

ఇటీవల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో కుడా అభివృద్ధి పనులకు రూ.850 కోట్ల నిధులు కావాలని కోరామని, ఇప్పటికే రూ.300కోట్లు విడుదలయ్యాయన్నారు. మిగతా పనులను బట్టి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. రూ.500కోట్లు ఇన్నర్ రింగ్‌రోడ్డు, రూ.50కోట్లు భద్రకాళి మాడవీధులు, రూ.120కోట్లు వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణం, రూ.50కోట్లు కాళోజీ కళాక్షేత్రం, రూ.50కోట్లతో గుండు చెరువు అభివృద్ధి పనులు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజీత్‌రెడ్డి, మురళీధర్, భీంరావుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.


గుట్కా విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న గుట్కాలతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 10: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీట్‌బజార్‌లో బి.మహేందర్ నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. బీట్ బజార్‌లో వ్యాపారం చేసుకుంటున్న మహేందర్ అనే వ్యక్తి వద్ద నిషేధిత గుట్కా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో దాడులు చేశారు. రూ.2లక్షల 61వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఏసీపీ మధుసూదన్ ధ్రువీకరించారు.

సముద్రాల పురుషోత్తమచార్య ఇక లేరు



హనుమకొండ కల్చరల్, జూలై 10: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో నాలుగు దశాబ్దాలుగా స్థానాచార్యులుగా పనిచేస్తున్న సముద్రాల పురుషోత్తమచార్య (87) మంగళవారం రాత్రి వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎక్సైజ్‌కాలనీలోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయన భార్య రంగనాయకమ్మ రెండేళ్ల కిందటే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వృత్తిరీత్యా నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా 1996లో ఉద్యోగ విరమణ చేశారు. ఆధ్యాత్మిక ప్రవచకుడిగా శ్రీ వైష్ణవ సంప్రదాయ ఆచార పరిరక్షకుడిగా ఉభయ వేదాంత పండితుడిగా, ఆధ్యాత్మిక భావజాలం ఉన్న ఆయనను.. కవిశాబ్దిక కేసరి నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి వెంకటేశ్వర ఆలయానికి పురుషోత్తమచార్యను స్థానాచార్యగా నియామకం చేశారు. అప్పటి నుంచి ఆలయంలో చుట్టుపక్కలకు కాలనీ చెందిన వేలాది మందికి ఆధ్యాత్మిక ఆచార్యుడిగా భక్తుల మన్ననలు అందుకున్నారు. బుధవారం మధ్యాహ్నం హనుమకొండ వికాస్ నగర్ ప్రాంతంలోని శ్మశాన వాటికలో ఆయన పెద్ద కుమారుడు రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీధరాచార్యులు అంత్యక్రియలను నిర్వహించారు. పురుషోత్తమాచార్య మరణ వార్త ఎక్సైజ్ కాలనీ పరిసర ప్రాంత భక్తులను తీవ్ర దుంఖంలో ముంచెత్తింది. ఈయన మృతితో ఓరుగల్లు నగరం గొప్ప ఆధ్యాత్మికవేత్తను కోల్పోయిందని సత్ సంప్రదాయ పరిరక్షణ సభ కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్య విదేశాలనుంచి సంతాపం ప్రకటించారు. వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ కొక్కుండ వెకంట నర్సయ్య, తదితర అనేక మంది పెద్దయ్యగారు మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

ఆలయభూముల కబ్జాపై లోకాయుక్త విచారణ

హనుమకొండ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని ఐదు దేవాలయాలకు చెందిన సుమారు 20.39 ఎకరాల భూమి కబ్జాపై బుధవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. పద్మాక్షి దేవాలయం భూమి 6.22ఎకరాలు, వీరపిచ్చమాంబ మఠం భూమి 30 గుంటలు, సిద్దేశ్వరాలయానికి సంబంధించిన 2.24 ఎకరాలు, వేణుగోపాలస్వామి భూమి 1.11ఎకరాల అక్రమణలపై వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ జరిపింది. చక్రపాణి, రాజుతోపాటు దేవాదాయ శాఖ పక్షాన ముగ్గురు ఈవోలు విచారణకు హాజరయ్యారు. ప్రతీ సారి దేవాదాయ శాఖ నుంచి కింది స్థాయి అధికారులే హాజరుకావడం పట్ల లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసును ఈనెల 15కు వాయిదా వేస్తూ ఆ రోజుదేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.





పెనుగోలుకు వెళ్లేందుకు వాగు దాటుతున్న వైద్యాధికారి మధుకర్, సిబ్బంది, వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మధుకర్ బృందం

కాలినడకన వెళ్లారు.. వాగులు దాటారు..

అడవి పల్లెల్లో వైద్యసేవలందించిన డాక్టర్లు, సిబ్బంది

వాజేడు/గూడూరు, జూలై 10: ఆ వైద్యాధికారులు, సిబ్బంది తాము ఎంచుకున్న వృత్తిపై నిబద్ధతను చాటుకున్నారు. అందరిలాగా తమకెందుకులే అనుకోలేదు. ఎనిమిది గంటలు డ్యూటీ చేసుకుంటే తమ జీతం తమకు వస్తుందిలే అనుకోలేదు. సరైన రవాణా సౌకర్యాల్లేక.. మెరుగైన వైద్యం పొందలేక జ్వరాలతోనే మంచాల్లో మూలుగుతూ ఉండే అడవి పల్లెవాసులకు అండగా నిలవాలనుకన్నారు. రోడ్లు లేకపోయినా.. వంతెనలు లేకపోయినా.. అడవి దారిలో కిలోమీటర్ల మేర నడిచారు. వాగులు దాటారు. అడవి బిడ్డలకు వైద్యసేవలు అందించారు. ములుగు జిల్లా వాజేడు మండలం, మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురం ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది బుధవారం అడవి బాటలో వెళ్లి.. వాగులు దాటి వైద్యసేవలందించారు.

● తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో దట్టమైన అటవీ ప్రాంతంలో ఎటువంటి రవాణా సౌకర్యం లేని మారుమూల కుగ్రామమైన వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి వాజేడు వైద్యాధికారి డాక్టరు అల్లి మధుకర్ తన సిబ్బందితో కలిసి కాలినడకన వాగులు, వంకలు, కొండలు దాటుకుంటూ వెళ్లారు. అయితే మంగళవారం మధ్యాహ్నమే వాజేడు పీహెచ్‌సీ నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెనుగోలుకు కాలినడకన బయలుదేరిన ఆ బృందం గుమ్మడి దొడ్డి మీదుగా ప్రమాదకరమైన నల్లందేవి వాగు దాటి రాత్రికి పెనుగోలు చేరుకున్నారు. ఆ తర్వాత బుధవారం ఉదయం వైద్యశిబిరం నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న గిరిజను లకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పెనుగోలులో ప్రస్తుతం 10ఇళ్లు ఉండగా 39 మంది జనాభా ఉన్నారు. 15 ఏళ్ల లోపు చిన్నారులు 12మంది, ఏడాదిలోపు చిన్నారి ఒకరు ఉండగా ప్రస్తుతం ముగ్గురు జ్వరాలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ మధుకర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ మధుకర్ వెంట హెచ్‌ఏలు చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, ఎల్‌టీలు లఖన్, రజినీకాంత్, డీఏవో ప్రశాంత్, ఆశా కార్యకర్త సమ్మక్క, గుమ్మడిదొడ్డికి చెందిన కారం ఆదినారయణ, జజ్జరి అశోక్‌లు ఉన్నారు.

● గూడూరు మండలంలోని అయోధ్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన మట్టేవాడ శివారు దొరవారి తిమ్మాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత మట్టేవాడ నుంచి ట్రాక్టర్‌లో కొత్తగూడ మండలం కార్లాయి వరకు వెళ్లి.. అక్కడ్నుంచి సుమారు 8 కిలోమీటర్ల మేర అడవి ప్రాంతంలో నడుస్తూ వాగులు దాటుకుంటూ దొరవారి తిమ్మాపురానికి చేరుకున్నారు. అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లిన వైద్యసిబ్బంది 42 మంది ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరం తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి, రక్తనమూనాలు సేకరించారు. ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు దేవేందర్, నరేష్, హెచ్‌ఈవో లోక్యనాయక్, సూపర్‌వైజర్లు అరుణమ్మ, హేమలత, ఎస్ఎన్.రజిత, హెల్త్ అసిస్టెంట్‌లు సర్దార్‌బాబు, లాలు, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్ సీతమ్మ పాల్గొన్నారు.





దొరవారి తిమ్మాపురానికి వాగుదాటుతూ వెళ్తున్న వైద్యులు, సిబ్బంది, దొరవారి తిమ్మాపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రూప్-1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 19వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని

తెలిపారు. హైదరాబాద్, ఖమ్మం జిల్లాలలో 75రోజుల పాటు శిక్షణ ఇస్తామని, ప్రతీ సెంటర్‌కు 150 మంది చొప్పున శిక్షణ ఉంటుందని, కోచింగ్ వ్యవధిలో ప్రతీ అభ్యర్థికి రూ.5000 సైఫండ్ మంజూరు చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 040-24071178 నెంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన జంగా రాఘవరెడ్డి



తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జంగా రాఘవరెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 10: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో స్వీకరణ కార్యక్రమం జరిగింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఇతర కాంగ్రెస్ నేతలు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నాయకుల అభినందనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు రాఘవరెడ్డి కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు చెప్పారు.

మంత్రి పొంగులేటిని కలిసిన టీజీవోలు



మంత్రి పొంగులేటితో టీజీవోలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై10: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీజీవోస్ నాయకులు కలిశారు. ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన రెవెన్యూ, ఇతర డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వారి జిల్లాలకు బదిలీ చేయాలని ఈ సందర్భంగా టీజీవో నాయకులు మంత్రికి విన్నవించారు. అలాగే జయశంకర్ భూపాలపల్లిలో టీజీవో భవనానికి నిధులు కేటాయించాలని కోరారు. మంత్రి పొంగులేటిని కలిసిన వారిలో టీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, రాష్ట్ర బాధ్యులు పరమేశ్వర్ రెడ్డి, యాదగిరి, టీజీవో నాయకులు ఈగ వెంకటేశ్వర్లు, సురేష్‌కుమార్‌లు ఉన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు నోటీసులు

లెక్కలు సమర్పించకపోవడంతో ఆడిట్ అధికారుల చర్య

వరంగల్ మెడికల్, జూలై 10: వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు ఆడిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎంజీఎంలో మందులు, భవన నిర్మాణ పనులు, స్టేషనరీ, అభివృద్ధి నిధులు, మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లకు సంబంధించిన ఆడిట్ భారీగా తేడా వచ్చింది. దీంతో 30 అంశాలపై లెక్కలు, దానికి సంబంధించిన బిల్లులు ఇవ్వాలని ఆడిట్ అధికారులు గతంలోనే నోటీసులు ఇచ్చారు. దానికి సమాధానం రాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు. లెక్కలు, బిల్లులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. కాగా, ఎంజీఎంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ కొనుగోళ్లలో కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సూపరింటెండెంట్ లెక్కలు ఇవ్వకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆడిట్ అధికారుల నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారం వరంగల్ మెడికల్‌వర్గాల్లో సంచలనంగా మారింది. గతంలో ఉన్న సూపరింటెండెంట్‌పై అనేక ఆరోపణలు రావడంతో రెండేళ్ల కిందట చంద్రశేఖర్‌ను సూపరింటెండెంట్‌గా ప్రభుత్వం నియమించింది. అయితే ఈయన కూడా అదే దారిలో నడవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



మార్కెట్ కార్యదర్శి నిర్మలను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఏనుమాముల మార్కెట్ కార్యదర్శిగా నిర్మల బాధ్యతల స్వీకరణ

వరంగల్ సిటీ, జూలై 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత కార్యదర్శిగా పోలెపాక నిర్మల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల గతంలో ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి(ప్యాక్)గా పనిచేశారు. మార్కెట్ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, కార్మికులు, రైతులతో ఆమెకు మంచి అనుబంధం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న నిర్మల పదోన్నతిపై వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన సంగయ్య ఉద్యోగ విరమణ చేయడం, ఎన్నికల కోడ్ ఉండటంతో వెంటనే ఆస్థానాన్ని భర్తీ చేయడానికి అవకాశం లేకపోయింది. దీంతో జమ్మికుంట మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న గుగులోతు రెడ్డికి(ఫుల్ అడిషనల్ చార్జ్) వరంగల్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించే క్రమంలో భాగంగా పోలెపాక నిర్మలకు పదోన్నతి కల్పించి కార్యదర్శిగా నియమిం చారు. దీంతో బుధవారం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా నిర్మల పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎట్టకేలకు పూర్తి స్థాయి కార్యదర్శిని నియమించినప్పటికీ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించకపోవడంతో రైతులు, వ్యాపారులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శిని కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పూర్తి స్థాయి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పోలెపాక నిర్మలను వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ప్రతినిధులు బుధవారం చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ఉపాధ్యక్షులు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరు వేదప్రకాశ్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, సంబంధిత సెక్షన్లప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ సీఎస్ఈ, ఐటీ బీవోఎస్ చైర్‌పర్సన్‌గా అర్చన



కృష్ణయ్య, అర్చనకు నియామక పత్రాలను అందిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 10: కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్ఈ, ఐటీ) విభాగం నూతనబోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) ఛైర్‌పర్సన్‌గా డాక్టర్ టి.అర్చన నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అర్చనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగిన కె.పద్మజ నుంచి అర్చన బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ అర్చన 2010లో వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అర్చన గతంలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెం హాస్టల్ సంయుక్త సంచాలకులుగా, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఇన్‌చార్జిగా పనిచేశారు. డాక్టర్ అర్చన పర్యవేక్షణలో ఇద్దరు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 15కుపైగా అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టర్ అర్చన ప్రస్తుతం విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల కొత్తగూడెంలో సంయుక్త సంచాలకులుగా పనిచేస్తున్నారు. అర్చనను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

సంస్కృత విభాగం చైర్మన్‌గా కృష్ణయ్య

కాకతీయ యూనివర్సిటీ సంస్కృతం విభాగం నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా డాక్టర్ ఈ.కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి కృష్ణయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు బీవోఎస్ చైర్మన్‌గా కొనసాగిన పింగళి కళాశాల సంస్కృత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కృష్ణయ్యను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పొగతో ఉక్కిరి బిక్కిరి



- ఏనుమాముల మార్కెట్ ప్రాంతంలో మిర్చి తొడిమెల కాల్చివేత
- ఘాటు పొగతో తీవ్ర ఇబ్బంది పడుతున్న సమీప ప్రజలు
- ఊపిరితిత్తుల సమస్యల బారిన పడుతున్న వైనం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- కనిపించని పారిశుధ్య అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: వారంత నిరుపేదలు.. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక కష్టాన్ని నమ్ముకుని పొట్టచేత పట్టుకుని కట్టుబట్టలతో నగరానికి వచ్చి కష్టాల కడలిలో కాలం వెల్లదీస్తున్నారు. వారిని పేదరికం వదిలినా.. మిర్చి ఘాటు కాలుష్యం మాత్రం వదలకుండా ఆరోగ్యాలను క్షీణింపజేస్తోంది. దీంతో శ్వాసకోశ వ్యాధులు అస్తమా, టీబీ, దగ్గు, దమ్ము, క్షయవ్యాధులతో పాటు గుండె పోటుకు గురవుతున్నారు. ఇదంతా ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన ఏనుమాముల మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల కాలనీలలో జరుగుతోంది.

సాయంత్రం అయ్యిందంటే ఏనుమాముల చుట్టుపక్కల ప్రాంతం కాలనీలో కాలుష్యంతో కమ్ముకుపోతోంది. అడ్తిదారులు, సంపన్న వర్గాలు ప్రజల ప్రాణాలు లెక్క చేయకుండా మిర్చి తొడిమెలు మంటల్లో కాలుస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారు. యేడాదిలో ఆరు మాసాలు మిర్చి సీజన్‌లో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మిర్చి తొలడిమెలు తీసి మార్కెట్ పరసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలు, మిర్చి కల్లాల వద్ద రాత్రి సమయాల్లో కాలుస్తుండడంతో సమీప ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. మార్కెట్ పరిసర కాలనీలైన గ్రేటర్ 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్, గాంధీనగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, ఏనుమాముల, దేశాయిపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో సాయంత్రం సమయంలో మిర్చి తొడిమెలు ఘాటు కాలుష్యం కోరలు చాస్తోంది. తొడిమెలు కాల్చిన కాలుష్యపు ఘాటు ప్రజలను నిద్రకు దూరం చేస్తోంది. ఈ ప్రాంతంలో నివసించే వారు కాలుష్య కోరలకు బలవుతూ శ్వాసకోశ, గుండె జబ్బులకు గురవుతున్నారు.

200కు పైగా మిర్చి కల్లాలు


ఏనుమాముల మార్కెట్‌లో మిర్చి కల్లాలు 200కు పైగా విస్తరించి ఉన్నాయి. అడ్తిదారులు, వ్యాపారులు కోల్డ్‌స్టోరేజీల ఆవరణలో వందలాది టన్నుల మిర్చిని డంప్ చేయడంతో పాటు ఆరబోస్తున్నారు. వీటిని సమీపగ్రామాల్లో నివసించే మహిళా కూలీలతో తొడిమెలు తీయిస్తున్నారు. తీసిన తొడిమెలను కోల్డ్ స్టోరేజీల బయటపోసి మిర్చిని ఎండబెట్టి కారంపొడి చేసి ఇతర ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతి చేస్తారు. అయితే నిర్లక్ష్యంగా బయటపోసిన తొడిమెలను నిర్వాహకుల ఆదేశాల మేరకు అక్కడ పని చేసే కూలీలు సాయంత్రం సమయంలో నిప్పుపెడుతుంటారు. ఇక దాంట్లోంచి వచ్చే పొగతో ఆ సమీప ప్రాంతాల్లో నివసించే వారికి నరకం కనబడుతోంది.

పత్తాకు లేని పారిశుధ్య సిబ్బంది

ఏనుమాముల మార్కెట్ సమీపంలో మిర్చి కల్లాల వద్ద చాలా కాలంగా ఇదంతా జరుగుతున్నా పారిశుధ్య కార్మికులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మునిసిపల్ సిబ్బంది సైతం మిర్చి ఘాటుకు భయపడి అటుగా వెళ్లడం లేదనే విమర్శలున్నాయి. ఈ ప్రాంతాన్ని పరిశీలించే శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపం వల్లనే తొడిమెల కాల్చివేతకు వ్యాపారులు పూనుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. కోల్డ్ స్టోరేజీల బయట పడేసిన మిర్చి తొడిమెలను ముందస్తుగా గుర్తించి మునిసిపల్ ట్రాక్టర్లు, డంపర్‌బిన్‌ల ద్వారా తరలించాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న జవాన్లు నెలవారి మామూళ్లకు ఆశపడి వ్యాపారుల ఆకృత్యాన్ని పట్టించుకోవడం లేదని చుట్టుపక్కలవారు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మిర్చి తొడిమెలను కాల్చే వారిని బల్దియా సిబ్బంది గుర్తించి జరిమానాలు విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారు..


డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్. చెస్ట్ ఫిజీషియన్



మిరప తొడిమెలనుంచి వచ్చే ఘాటు పొగ పీల్చుకోవడం వల్ల ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధితోపాటు నిమోనియా వస్తుంది. కండ్లు ఎర్రగా మారుతాయి. ముక్కులో ఎలర్జీ వచ్చి తుమ్ములు, దగ్గు వస్తాయి. ఇంకా జలుబుతో పాటు ఆయాసం వస్తుంది. కొద్ది రోజుల తర్వాత అస్తమాకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. శరీరంపై దద్దుర్లు, కురుపులు ఏర్పడి మంటతో కూడిన దురద ఏర్పడుతుంది. ఇంకా దీర్ఘకాళిక వ్యాధులైన హైపల్ సెన్సివిటీ, బీపీ వచ్చే అవకావాలు ఉంటాయి. ఈ పొగ నుంచి ప్రజలు దూరంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది.

రాత్రి అయిందంటే పొగతో చస్తున్నాం..

ఉడుత కాంతమ్మ, ఎన్టీఆర్ నగర్



రాత్రి అయ్యిందంటే వందలాది మిర్చి కల్లాలు రోడ్లు, గోదాముల ముందు పెద్ద ఎత్తున వెలుస్తాయి. వందల మంది కూలీల ద్వారా తీసిన తొడిమెలు అక్కడే వదిలేసి వెళ్లడంవల్ల రాత్రి సమయాల్లో నిప్పు అంటిస్తారు. తెల్లవారేవరకు ఈ ప్రాంతం ఘాటు పొగతో కప్పబడి ఉంటుంది. ఇప్పటికే చాలామంది రోగాల బారిన పడ్డారు. కొందరు గుండెపోటుకు గురయ్యారు.

సోడషపల్లిలో నకిలీ నోటు కలకలం

వేలేరు(ధర్మసాగర్), జూలై 10: హనుమకండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లి పోస్టు ఆఫీసులో నకిలీ ఐదు వందల నోటు ఇచ్చారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఆరోపించారు. సోడషపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి అనే వృద్ధుడు వృద్ధాప్య పింఛన్ కోసం ఐదు రోజుల కిందట స్థానిక పోస్టు ఆఫీసుకు వెళ్లాడు. పింఛన్ తీసుకుని తిరిగి ఇంటికి వచ్చాడు. ఐదు రోజుల తర్వాత గ్రామంలోని ఓ దుకాణానికి వెళ్లగా రూ.500 నోటు చెల్లదని షాపు యజమాని చెప్పడంతో అక్కడ ఉన్న వారు నోటును గమనించి నకిలీనోటు అని వృద్ధుడికి చెప్పారు. దీంతో విషయన్ని బాధితుడు తన కుమారుడు ప్రభాకర్‌రెడ్డికి తెలుపడంతో ఆయన పోస్టు ఆఫీసుకు ఫోన్ చేసి నకిలీ నోటు ఇచ్చారని తెలిపాడు. దీంతో సదరు పోస్టాఫీసు ఉద్యోగి దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నకిలీ నోటు పంపిణీ చేసిన పోస్టు ఆఫీసు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యువతి అదృశ్యం

ధర్మసాగర్, జూలై 10: ఓ యువతి అదృశ్యమైన సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణగిరి గ్రామ శివారు చెటాల్ తండాకు చెందిన గుగులోతు కల్పన (22)అనే యువతి ఈనెల 1న హనుమకొండలో పరీక్ష రాయడానికి ఇంటి నుంచి వెళ్లింది. పరీక్ష రాయడానికి వెళ్లి సాయత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు కల్పన ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికారు. అయినప్పటికీ ఆచూకీ దొరకకపోవడంతో ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో యువతి తండ్రి భిక్షపతి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గీసుగొండ, జూలై 10 : మండలంలోని కొమ్మాల ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల మరో పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు చక్రవర్తుల నాగార్జున, చందా రాజేందర్, శైలజలను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలలోని విద్యార్థులందరికి బ్యాగులు, కుర్చీలను స్వంత ఖర్చులతో అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, ఉపాధ్యాయులు రాము, విశ్వేశ్వర్‌రావు, మాలతి, శ్రీనివాస్, సాగర్, పద్మ, లక్ష్మి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గానకోకిల పురస్కారానికి విజయ్‌కుమార్ ఎంపిక



వరంగల్ కల్చరల్, జూలై 10: తెలంగాణ ఉద్యమ గాయకుడు, ధూంధాం ప్రజా కళాకారుడు జిల్లాకు చెందిన దామెర విజయ్‌కుమార్‌ను ఉద్యమ గానకోకిల పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తర తెలంగాణ ప్రాంత వనరుల పరిరక్షణ కోసం తమ సంస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ నెల 12న కరీంనగర్ ప్రెస్ భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఉద్యమ నాయకులకు సన్మానం ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కాగా, ఈ పురస్కారానికి తనను ఎంపిక చేయడం పట్ల విజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు


విద్యార్థులకు మందులు అందజేస్తున్న కార్పొరేటర్ రవి

కరీమాబాద్, జూలై 10 : వరంగల్ కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ తోట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అనిత ఆధ్వర్యంలో 300మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఇందులో కొందరికిదగ్గు, జలుబు ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడు తూ వర్షాకాలంలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ బుర్ర మురళి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్, స్థానిక నాయకులు అక్తర్, వైద్య సిబ్బంది మంజుల, మౌనిక, ప్రభాకర్, పద్మ, వీణ, కృష్ణ వేణి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల గుర్తింపులో వేగం పెంచండి

▸▸ టౌన్ ప్లానింగ్ అధికారులతో మేయర్ సుధారాణి


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: గ్రేటర్ వరంగల్ పరిధిలో శిథిల భవనాల గుర్తింపులో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ 66 డివిజన్ల పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలు చాలా వరకు ఉన్నాయని, వాటిని గుర్తించి ముందస్తు ప్రమాదాలను అరికట్టాలన్నారు. రాబోవు 4 నెలల కాలంలో ఎలాంటి సెల్లార్‌ల నిర్మాణాలు చేపడ్డకూడదని ఆదేశించారు. గతంలో నిర్మించిన సెల్లార్‌లలో నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. అక్కడక్కడా సెల్లార్‌లలో నిలిచిన నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపించాలన్నారు. ఇంకా సెల్లార్‌లలో విద్యుత్‌తో నడిచే పరికరాలను వెంటనే తొలగించాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై గీవెన్స్‌లో చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కార మార్గాన్ని చూపించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, సీపీ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్‌లు, టీపీబీవోలు పాల్గొన్నారు.

ఊరికి దూరం.. ప్రజలకు భారం

▸▸ రెండు కిలోమీటర్ల దూరంలో ఖిలావరంగల్ యూపీహెచ్‌సీ

▸▸ ఇన్‌చార్జ్ వైద్యుడితోనే ఆస్పత్రి నిర్వహణ

▸▸ సిబ్బంది కొరత.. మౌలిక వసతులు కరువు


వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు


ఆస్పత్రి ఆవరణలో పనిచేయని బోరు

ఖిలావరంగల్, జూలై 10: ఖిలావరంగల్ 37, 38వ డివిజన్ ఎస్టీ కాలనీలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) స్థానిక ప్రజలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నగర ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందించేందుకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా వెనకబడిన ప్రాంతానికి చెందిన అండర్ రైల్వేగేట్‌లో చింతల్(పుప్పాలగుట్ట), ఖిలావరంగల్ పడమర కోటలో 20 సంవత్సరాల క్రితం అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఖిలావరంగల్ పడమర కోటలోని ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఖిలా వరంగల్ పడమర, మధ్యకోట, తూర్పుకోట, ఖమ్మంరోడ్, ఏకశిలనగర్, విద్యానగర్, సాకరాశికుంట, కీర్తినగర్ తదితర ప్రాంతాలకు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో ఆయా ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణులు, పిల్లలు, పెద్దలు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేందుకు సరియైన సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వ్యయ ప్రయాసలకోర్చి ఇంతదూరం ఆరోగ్య కేంద్రానికి వస్తే సమయానికి వైద్యుడు, సిబ్బంది లేకపోవడంతో సహాయకులు ఇచ్చే మందులు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖిలావరంగల్ యూపీహెచ్‌సీలో రెండేళ్లుగా రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్(డాక్టర్) లేకపోవడం, ఇన్‌చార్జ్ డాక్టర్లతోనే నడిపిస్తున్నారు. ఆస్పత్రిలో మొత్తం 17 మంది సిబ్బందికి గాను 12 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా స్టాఫ్‌నర్సు-1, ఫార్మాసిస్టు-1, సూపర్‌వైజర్-1. మొత్తం 3 పోస్టులు ఖాళీగా ఉండగా, మరో ఇద్దరు స్టాఫ్, అదనపు విధుల్లో డీఎంహెచ్‌వో ఆఫీస్‌లో విధులు నిర్వరిస్తున్నట్లు సమాచారం. దీంతో డాక్టర్, సిబ్బంది సరియైన సమయంలో రాకపోవడంతో పాటు 37, 38, 39 డివిజన్లలో ఖిలావరంగల్ తూర్పుకోటతో పాటు ఖమ్మంరోడ్, ఏకశిలనగర్, విద్యానగర్, కీర్తినగర్, సాకరాశికుంట తదితర ప్రాంతాల ప్రజలకు య ూపీహెచ్‌సీ దూర భారంగా మారింది. దీంతో రోగులు రోజుకు 10 నుంచి 20 మంది కూడా రావడం లేదని స్థానికులు చెబుతున్నారు.

నిత్యం మీటింగ్‌లు, క్యాంపులు, ఇమ్యూనైజేషన్ డేలు..

వివిధ ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి వృద్ధులు, మహిళలు, గర్భిణులు, పిల్లలను తీసుకొని ఖిలావరంగల్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వస్తే డాక్టర్ నుంచి సిబ్బంది వరకు మీటింగ్‌లు, క్యాంపులు, అంగన్‌వాడీ సెంటర్, ఇమ్యూనేషన్ డేలు తదితర ప్రోగ్రాంలు ఉన్నాయంటున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఇంతదూరం వచ్చాక ఏమి చేయాలని అడిగితే సిబ్బంది మందు గోళీలు, టానిక్‌లు తీసుకొని వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. దీంతో ప్రజలకు రోగం తగ్గకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందంటున్నారు. గత రెండేళ్లుగా ఖిలావరంగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు పూర్తిస్థాయి మెడికల్ ఆఫీసర్, తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారిని 37, 38, 39 డివిజన్లతో పాటు ఖిలావరంగల్ ప్రజలు వేడుకుంటున్నారు.


ఖిలావరంగల్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మౌలిక వసతులు కరువు

ఖిలావరంగల్ 37వ డివిజన్ పడమర కోటలోని యూపీహెచ్‌సీలో బోరు పనిచేయక పోవడంతో రోగులు, పిల్లలు ఇతరత్రా అవసరాలకు చుక్కనీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఆస్పత్రి ముందు ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు, ఆస్పత్రి ప్రధాన గేట్ పాడవగా ఆస్పత్రిలోనికి రాత్రులు ఇతరులు వచ్చి పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారన్నారు. 20 సంవత్సరాల క్రితం పడమర కోటలోని ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో బోరు పాడై రెండు సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతు చేయడంలో స్థానిక కార్పొరేటర్, జిల్లా వైద్యాధికారులు, ఆస్పత్రి డాక్టర్ తగిన చొరవ చూపడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

సిబ్బందిని నియమించాలి

సుద్దాల నాగరాజు, ఖిలావరంగల్



ప్రస్తుత వర్షాకాలంలో రానున్న వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి. వెనకబడిన ప్రాంతానికి చెందిన 37, 38, 39 డివిజన్లకు చెందిన ఖిలావరంగల్ మూడు కోటలతో పాటు, ఖమ్మంరోడ్, ఏకశిలనగర్, విద్యానగర్, సాకరాశికుంట, కీర్తినగర్ తదితర ప్రాంత ప్రజలకు వైద్యాన్ని అందించేందుకు జిల్లా వైద్యాధికారులు తగిన చొరవ చూపి పర్మినెంట్ డాక్టర్‌ను, సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

▸▸ హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

▸▸ రంగశాయిపేట శివారు, ఉర్సు గుట్ట ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు ఆపాలంటున్న బాధితులు


రంగశాయిపేట శివారులో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ

కరీమాబాద్, జూలై 10: వరంగల్ ఉర్సు గుట్ట, రంగశాయిపేట శివారు ప్రాంతంలోని ఓ సర్వే నంబర్‌లోని సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో డెవలపర్స్ పేరుతో కొందరు రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాల్లో భాగంగా తమకు చెందిన 25 గుంటల వ్యవసాయ భూమి సరిహద్దులను చెరిపి కబ్జాకు పాల్పడి నిర్మాణాలు చేస్తున్నారంటూ కొందరు భూ యజమానులు బుధవారం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని అధికారులను కోరుతున్నారు. ఈ ప్రాంతంలో చేపడుతున్న నిర్మాణాలు నిలిపివేయాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ నిర్మాణాలను ఆపాలని రెవెన్యూ మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేసి పరిస్థితిని విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉర్సు గుట్ట ప్రాంతంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 10: హనుమకొండ పరిధిలోని ఎన్‌జీవోఎస్ కాలనీ వద్ద మిషన్ భగీరథ పనులు జరు గుతున్న నేపథ్యంలో గురువారం ఒక్కరోజు నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు ఇంజనీరింగ్ విభాగం ఈఈ రాజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ వాల్వ్ దెబ్బతినడం వల్ల నీటి సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఇనుగాలను కలిసిన కాంగ్రెస్ నేతలు

గీసుగొండ, జూలై 10: 'కుడా' చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రాంరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హను మకొండలోని స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాయంపేట మాజీ ఎంపీటీసీ కాయిత భిక్షపతి, గొర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు రూ.12,093 చెల్లించాలి

▸▸ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్


సూపరింటెండెంట్ నిర్మలాకుమారితో సమస్యలపై మాట్లాడుతున్న యూసుఫ్

గిర్మాజిపేట, జూలై 10 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోని అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్‌లు పోను నెలకు రూ.12,093 చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలాకుమారిని కలిసి అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యను విన్నవించారు. ప్రభుత్వ జీవో ప్రకారం కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని, సత్వరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి నెలకు రూ.12,093 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.15,600 నిర్ణయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్ చేసి ప్రతి కార్మికుడికి నెలకు రూ.12,093 చెల్లించాల్సి ఉండగా సీకేఎం ఆస్పత్రిలో రూ.10,500 చెల్లించడం సరికాదని ఆయన వివరించారు. అలాగే ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు, కార్మిక చట్టాలు, నిబంధనల అమలుతో పాటుగా ప్రతి 20 రోజులు రెగ్యులర్ డ్యూటీ చేస్తే ఒక రోజు సెలవు ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలపై ఎలాంటి నిర్లక్ష్యం వహించినా యూనియన్ ఆందోళన చేస్తుందని ఆయన సూపరింటెండెంట్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమేష్, ఉపాధ్యక్షుడు ఎండి.యాకుబ్, సీకేఎం ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు శంకర్, కార్మికులు సక్కుబాయి, సంధ్య, శోభ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

▸▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆటోనగర్, జూలై 10: కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ కొత్తవాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. కులం, మతం పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూసే పార్టీలకు కాలం చెల్లిందన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పనిచేసిందని, పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సమస్యలను పట్టించుకోలేదని తెలిపారు. కమ్యూనిస్టులు, లౌకిక శక్తులతోనే ప్రజాస్వామ్య, రాజ్యాంగ రక్షణ సాధ్యమని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కృషి చేయాలని కోరారు. ఆగస్టు 22, 23, 24 తేదీల్లో హనుమకొండలోని హరిత హోటల్లో సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో రెండవ రోజు పార్టీ నిర్మాణంపై మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి, కులం, మతం, మతోన్మాదం అనే అంశంపై ఎండి.యూసఫ్ సీపీఐ నాయకులకు, కార్యకర్తలకు బోధించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, పంజాల రమేష్, నాయకులు, ప్రజానాట్య మండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవలందించడం అభినందనీయం

● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి


దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, జూలై 10 : పేద ప్రజలు అండగా ఉంటూ వారికి పలు సేవలు అందించడం అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదవారికి సహాయం చేయాలనే దృక్పథంతో పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని గుర్తుచేశారు. కార్యక్ర మంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు హరిప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్, మాచర్ల ప్రభాకర్, మల్లేశం, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటలను నమోదు చేసుకోవాలి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి ఉష


నెక్కొండ, జూలై 10 : పంటలను సాగు చేసిన రైతులు పంటలను తప్పకుండా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి డి.ఉష తెలిపారు. బుధవారం మండలంలోని పత్తిపాక, లావుడ్యతండ, నెక్కొండ తండ గ్రామాల్లో పంటల నమోదును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్ జిల్లా వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతుల్లో ఇంకా 50శాతం మంది నమాదు నమోదు చేసుకోలేదన్నారు. ఈ విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలాగే వాతావరణంకు అనుకూలంగా పంటలను సాగు చేయాలని , ఇంకా వరి నారు పోయని రైతులు ఇప్పుడు నారు పోసిన ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలి

వర్ధన్నపేట, జూలై 10 : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేటలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని అన్నారు. బొగ్గు బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను రద్దు చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం ఐకేపీ వీఓఏ, వైద్య, ఆరోగ్య రంగంతో పాటు వివిధ పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి, చట్టాలు అమలు చేయాలని కోరారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

▸▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


వర్ధన్నపేటలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, జూలై 10 : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలో వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కల్యాణలక్ష్మి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు అండగా నిలబడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీలను దశల వారిగా తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు, రైతు రుణమాఫీ కార్యక్రమంతో పేద రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని రైతులు ఎలాంటి నిధులు చెల్లించకున్నా ప్రభుత్వమే చెల్లించి రైతుకు భారం తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఫైస సురేష్‌కుమార్, నాయకులు కమ్మగోని ప్రభాకర్, అబ్బిడి రాజిరెడ్డి, పోశాల వెంకన్న, సమ్మెట సుధీర్‌గౌడ్, పులి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పర్వతగిరి గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని కొంకపాక గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 26 మంది లబ్ధిదారులకు రూ.4,83,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారినికి ఐదురోజుల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉంటానని, రెండురోజులు మాత్రం సమస్యలు పరిష్కరించడానికి గాను హైదరాబాద్‌లో వివిధ శాఖల అధికారులతో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిరుపేదలకు ఇళ్లను నిర్మించడానికి గాను ప్రభుత్వం నియోజకవర్గానికి 3వేల చొప్పున మంజూరుచేసిందని, త్వరలోనే దానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక, మంజూరు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావడానికి గాను 'డయల్ యువర్ ఎమ్మెల్యే' పేరిట ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఫోన్‌లో సమస్య వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీవో శ్రీనివాసులు, పీఆర్ డీఈ ఇజ్జగిరి, ఏఈ కవిత, పశు వైద్యాధికారి నరేష్‌కుమార్, సొసైటీ చైర్మన్ దేవేందర్, వైస్ చైర్మన్ మధుసూదన్ రావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్ రావు, మాజీ సర్పంచ్ రంజిత్‌గౌడ్, నాయకులు ప్రమోద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రూరల్

మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌కు సన్మానం

నర్సంపేట, జూలై 10 : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియామకమై న పాలాయి శ్రీనివాస్‌ను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు బొకే అందజేసి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడుకల్లెపెల్లి ప్రణయదీప్, ముస్లిం సంఘాల ప్రతినిధి ఎస్కే.జావిద్, విద్యావంతుల వేదిక నాయకుడు సాంబరాతి మల్లేశం, కాం గ్రెస్ పార్టీ పట్టణ అధికార ప్రతినిధి గుంటివీర ప్రకాశ్, ఎబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిడ్డి పార్థసారథి, కుమ్మరికుంట శ్రీకాంత్, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రసిడెంట్ కొమాండ్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే మోకు దెబ్బ నాయకులు అనంతుల రమేశ్‌గౌడ్, గొడిశాల సదానందం, గంపరాజేశ్వర్, మాచర్ల అయిలుమల్లు, గోపగాని వెంకటేశ్, రామగోని సుధాకర్, శీలంవీరన్న, బొడిగె మల్లేషం, మేరుగు గంగాధర్, ముంజాల రాజేందర్, హరిప్రసాద్, మర్థ గణేశ్, జనగాం మల్లేశం తదితరులు పాలాయి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

పేదలకు సేవలు అందించడం అభినందనీయం

• ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



దివ్యాంగులు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, జూలై 10 : పేద ప్రజలు అండగా ఉంటూ వారికి పలు సేవలు అందించడం అభినందనీయమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డిల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేద వారికి సహాయం చేయాలనే దృక్పథంతో పనిచేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని గుర్తుచేశారు. కార్యక్ర మంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకుడు హరిప్రసాద్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్, మాచర్ల ప్రభాకర్, మల్లేషం, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణంలో ఇష్టారాజ్యం

• ప్రయాణికులకు అసౌకర్యం



పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం

వర్ధన్నపేట, జూలై 10 : వర్ధన్నపేట పట్టణంలోని బస్టేషన్ ప్రయాణ ప్రాంగ ణంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్ధన్నపేట బస్టేషన్‌కు పట్టణంతో పాటు వివిధ గ్రామాలు , తండాల నుంచి వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, తొర్రూరు తదితర ప్రాంతాలకు నిత్యం ప్రజలు ప్రయాణిస్తుంటారు. బస్సుల కోసం బస్టేషన్‌లో ప్రయాణికులు వేచి ఉండేందు కోసం బల్లలతో పాటు ప్రాంగణంలో గద్దెలను ఆర్టీసీ అధికారులు నిర్మించారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రయాణ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు పార్కింగ్ చేస్తూ వెళ్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందు వేచి ఉండే ప్రయాణికులు వాహ నాల పార్కింగ్ వలన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ తోపాటు పోలీసు అధికారులు స్పందించి బస్టేషన్ ప్రయాణ ప్రాంగణంలో వాహ నాలను పార్కింగ్ చేయకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టాలి



లీకేజీని పరిశీలన చేస్తున్న గ్రామస్థులు

దుగ్గొండి, జూలై 10: మండల కేంద్రంలో నీటి సరఫరా ప్రధాన పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. ట్యాంక్ నుంచి గ్రామంలోని వాడలకు సరఫరా అయ్యే పైప్‌లైన్ లీకేజీ కాగా, సిబ్బంది తవ్వి వదిలి వేయడంతో నీటి సరఫరా నిలిచి పోయింది. రెండు రోజులు గడువడంతో ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు వెల్లడించారు. త్వరగా పైప్‌లైన్ రిపేరు చేసి తాగు నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులు చేసేంతవరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని మాజీ ఎంపీపీ బురుగు రవీందర్, కొలిపాక బుచ్చయ్య కొలగాని రవిలు డిమాండ్ చేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

• వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేటలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, జూలై 10 : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలో వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కల్యాణలక్ష్మి అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు అండగా నిలబడడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీలను దశల వారిగా తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు, రైతు రుణమాఫీ కార్యక్రమంతో పేద రైతులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని రైతులు ఎలాంటి నిధులు చెల్లించకున్నా ప్రభుత్వమే చెల్లించి రైతుకు భారం తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు పైస సురేష్‌కుమార్, నాయకులు కమ్మగోని ప్రభాకర్, అబ్బిడి రాజిరెడ్డి, పోశాల వెంకన్న, సమ్మెట సుధీర్‌గౌడ్, పులి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పర్వతగిరి గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని కొంకపాక గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 26 మంది లబ్ధిదారులకు రూ.4,83,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారినికి ఐదురోజుల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉంటానని, రెండురోజులు మాత్రం సమస్యలు పరిష్కరించడానికి గాను హైదరాబాద్‌లో వివిధ శాఖల అధికారులతో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిరుపేద లకు ఇళ్లను నిర్మించడానికి గాను ప్రభుత్వం నియోజకవర్గానికి 3వేల చొప్పున మంజూరుచేసిందని, త్వరలోనే దానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక, మంజూరు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకురావడానికి గాను 'డయల్ యువర్ ఎమ్మెల్యే' పేరిట ఫోన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఫోన్‌లో సమస్య వివరిస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీవో శ్రీనివాసులు, పీఆర్ డీఈ ఇజ్జగిరి, ఏఈ కవిత, పశు వైద్యాధికారి నరేష్‌కుమార్, సొసైటీ చైర్మన్ దేవేందర్, వైస్ చైర్మన్ మధు సూదన్ రావు, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్ రావు, మాజీ సర్పంచ్ రంజిత్‌గౌడ్, నాయకులు ప్రమోద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలి



నెక్కొండలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న జీపీ ఉద్యోగులు

వర్ధన్నపేట, జూలై 10 : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.రాజేశ్వరి, అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వీరగోని నిర్మల డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కోర్కెల దినోత్సవా న్ని పురస్కరించుకొని వర్ధన్నపేటలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ బుధవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని అన్నారు. బొగ్గు బ్లాక్ లను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను రద్దు చేయాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యా హ్న భోజనం ఐకేపీ వీఓఏ, వైద్య ఆరోగ్య రంగంతో పాటు వివిధ పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి, చట్టాలు అమలు చేయాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మల సాంబయ్య, రేణుక, సత్యవతి, జె.రేణుక తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న మల్టీపర్పస్ వర్కర్స్ విధానంతో జీపీ కార్మికులకు పనిబారం పెరగడంతో ఇబ్బందులకు గురవుతున్నారని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రవికి వినతి పత్రాన్ని అందించిన అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ జీపీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని, నూతనంగా ప్రవేశపెట్టిన జీవో నెంబరు 51 సవరించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు వీరస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సాయిలు, మదార్, కృష్ణ, హైమ, భిక్షపతి, ఉపేంద్ర, సబిత, యాగలక్ష్మి, నాగమ్మ, సంపత్, ఆదిరెడ్డి, జయ రాజు, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా పాకాల ఆయకట్టు రోడ్డు



పాకాల ఆయకట్టుకు వెళ్లే రోడ్డు

చెన్నారావుపేట, జూలై 10 : మండల కేంద్రం నుంచి పాకాల వాగు మీదుగా పొలాలకు వెళ్లే రోడ్డు చినుకు పడితే బుర దమయంగా మారుతుందని ఆయ కట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండలంలోని కోనా పురం, ఖాదర్‌పేట, గొల్లపల్లె, మగ్దుంపు రం గ్రామంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పాకాల చెరువు చివరి ఆయకట్టు తుంగబంధ కాలువ కింద వందల ఎకరాలలో పొలాలను సాగు చేయడానికి వెళ్తుంటారు. ఖానాపురం మండలం రంగాపురం, కొత్తూరు గ్రామాలకు చెందిన గ్రామస్థులు సైతం ఇదే రహ దారిపై వెళ్తుంటారు. ఇటీవల కురిసిన చిన్నపాటి చినుకులకే బురద రోడ్డుగా మారిం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకాల వాగులో ఇసుకను అక్రమంగా రవాణ చేయడం. ఇటుక బట్టీల ఇటుకలను తరలించడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని, పిండి బస్తాలు తీసుకపోవడం. వరి నాట్లకు ఇబ్బందికరంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమత్తుల కోసం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకొని మరమత్తులు చేపట్టాల ని పలువురు రైతులు, గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

పూటకో పార్టీ మారేవారు విమర్శించడమా? : టీడీపీ

వర్ధన్నపేట, జూలై 10 : పదవుల కోసం కక్కుర్తిపడి పూటకో పార్టీ మార్చే జగ్గారెడ్డి, నిరంజన్‌రెడ్డి, విజయశాంతిలు చంద్రబాబునాయుడును విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడ మరియసురేఖ అన్నారు. బుధవారం మండ ల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో గులాంగురి చేసి బతికిన వారు మీరని, చంద్రబాబునాయుడు పేరు వింటే ఎందుకు భయపడుతున్నారో అర్థంకావడం లేదన్నారు. రాజకీయ నైతిక విలువలు తెలుసుకుని మసలుకోవాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ప్రజల గుండెల్లోంచి పుట్టిన పార్టీ అని స్పష్టంచేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇనుగాలను కలిసిన కాంగ్రెస్ నేతలు

గీసుగొండ, జూలై 10 : 'కుడా' చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రాంరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాయంపేట మాజీ ఎంపీటీసీ కాయిత భిక్ష పతి, గొర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

చెన్నారావుపేట, జూలై 10 : గ్రామాల్లో చెత్తాచెదారం నిండిపోయి ఉండడంతో అంటు వ్యాధులు రాకుండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు పెట్టాలని ఎంసీపీఐయూ పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. బుధవారం ఎంసీపీయూ పార్టీ ఆధ్వర్యంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో దయాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో సైడ్ డ్రైనేజీలు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరన్నారు. గ్రామాల్లో వీధి లైట్లు కూడా సరిగా వెలగడంలేదన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల మందును పిచికారి చేయడం, పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, సాంబయ్య, అచ్చానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెపా డీఎస్ఎం ఇన్‌చార్జ్‌గా వినయ్ నియామకం



వినయ్

చెన్నారావుపేట, జూలై 10 : మండలంలోని లింగగిరి గ్రామా నికి చెందిన తాడెం వినయ్‌ను మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్స్) జిల్లా సోషల్ మీడియా (డీఎస్ఎం) ఇన్‌చార్జ్‌గా నియామకం చేసినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ బుధవారం తెలిపారు. అలాగే నర్సం పేట డివిజన్ అధ్యక్షుడిగా పెండ్యాల యాదగిరిని నియమిం చామన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో నియమాక పత్రాలను అందించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సింగారాపు రామ, చిరంజీవి, నీరటి రాజు, పిట్టల కుమారస్వామి తదితతరులుపాల్గొన్నారు.

మీ సేవ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

దుగ్గొండి, జూలై 10 : మండలంలోని ఆరు మీ సేవా కేంద్రాల్లో ఆపరేటర్లుగా పని చేసేందుకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలోని తిమ్మంపేట, వెంకటాపుర, లక్ష్మీపురం, నాచినపల్లి, తొగర్రాయి, మహ్మదాపురం గ్రామాల్లో డీగ్రీ ఉత్తీర్ణతతో పాటు మహిళా సంఘంలో సభ్యులుగా ఉన్న వారు ఆయా గ్రామాల సీఏలకు దరఖాస్తులను చేసుకోవాలన్నారు. పరీక్ష నిర్వహించి ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారని, కంప్యూటర్‌లో నైపుణ్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు.

నేడు సన్నూరు ఆలయానికి చినజీయర్‌స్వామి రాక

రాయపర్తి, జూలై 10 : నేడు (గురువారం) మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలో ఉన్న సన్నూరు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చినజీయర్ స్వామి రానున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో శ్రీరంగాచార్య స్వామి విగ్రహాన్ని చినజీయర్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొంటారని తెలిపారు.

రైతులు పంటలను నమోదు చేసుకోవాలి

నెక్కొండ, జూలై 10 : పంటలను సాగు చేసిన రైతులు పంటలను తప్పకుండా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి డి. ఉషా తెలిపారు. బుధవారం మండలంలోని పత్తిపాక, లావుడ్యతండ, నెక్కొండ తండ గ్రామాల్లో పంటల నమో దును తనిఖీ చేశారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతుల్లో ఇంకా 50శాతం మంది నమాదు నమోదు చేసుకోలేదన్నారు. ఈ విషయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలాగే వాతవరణంకు అనుకూలంగా పంటలను సాగు చేయాలని , ఇంకా వరి నారు పోయని రైతులు ఇప్పడు నారు పోసిన ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు మంత్రి పదవి ఇవ్వాలి

వర్ధన్నపేట రూరల్, జూలై 10 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వాలని మండలంలోని ల్యాబర్తి గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుల్ల యాకాంతం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి వచ్చి ప్రభుత్వ ఉద్యోగంలో రాణించిన ఎమ్మెల్యేను, సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు దీవించాలని కోరాడు.

ప్రధాని దిష్టి బొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనంచేస్తున్న పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

నర్సంపేట, జూలై 10 : నీట్ పరీక్ష పేపర్ లీకేజికి నైతిక బాధ్యత వహిస్తు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్ యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపంవద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ మాట్లాడుతూ నీట్‌పరీక్ష లీక్ చేసి 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఎన్‌టిఎ ఏజెన్సీ చెలగాట మాడు తుందన్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరిగినా ప్రధాని ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకే జీకి బాధ్యతవహించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(నీట్) చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామాచేయాలని డిమాండ్ చేశా రు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటస్వామి, బిక్షపతి, మల్లన్న, రాజేశ్, ఉషాకిరణ్, అఖిల్, శివ, ప్రశాంత్, రవి, అఖిల, పవిత్ర , పావని, శ్యామలతదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గీసుగొండ, జూలై 10 : మండలంలోని కొమ్మాల ప్రాథ మిక పాఠశాలలో పనిచేసి ఇటీవల మరో పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు చక్రవర్తుల నాగార్జున, చందా రాజేందర్, శైలజలను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలలోని విద్యార్థులందరికీ బ్యాగులు, కుర్చీలను సొంత ఖర్చులతో అందించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, ఉపాధ్యా యులు రాము, విశ్వేశ్వర్‌రావు, మాలతి, శ్రీనివాస్, సాగర్, పద్మ, లక్ష్మి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మాడెలయ్యకు ప్రత్యేక పూజలు

చెన్నారావుపేట, జూలై 10 : మండలంలోని జల్లి గ్రా మంలో రజకుల ఆరాధ్యదైవమైన మాడెలయ్యకు ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. గ్రామంలో రజక సంఘం వారి ఆధ్వర్యంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు పండాలని పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో కులపెద్దలు చాగంటి రాజు, సంగెం రాంచంద్రయ్య, రాంచంద్రు, లక్ష్మీనర్సుశివకోటి, కొమ్మాలు, అశోక్, లక్ష్మయ్య, సుమన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో సౌకర్యాలు కల్పించాలి



పశువైద్యశాల భవనం ఆవరణలో మాట్లాడుతున్న సాంబయ్య

నల్లబెల్లి, జూలై 10 : మండల కేంద్రంలోని పశు వైద్య శాలలో సౌకర్యాలు కల్పించాలని సామాజిక కార్యకర్త బట్టు సాంబయ్య అన్నారు. బుధవారం స్థానిక పశు వైద్యశాలను సందర్శించి, మాట్లాడారు. వైద్యం కోసం తీసుకు వచ్చే పశువులకు నిలువ నీడలేకుండా పోయిందన్నారు. జిల్లా కలెక్టర్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పందించి పశువులకు షెడ్డు సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

వేతన వెతలు

కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్న కార్మికులు

పట్టించుకోని మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు



చెత్తను ట్రాక్టర్‌లో పోస్తున్న, రోడ్డును ఊడ్చి శుభ్రం చేస్తున్న కార్మికులు

నర్సంపేట, జూలై 10 : సూర్యుడు ఉదయించక ముందే విధుల్లో చేరి పట్టణంలో వార్డులను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్న మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు, ఎస్ఎంఆర్ కార్మికుల బతుకులు బాగుపడడం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెలనెలా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదు ర్కొంటున్నారు. నర్సంపేట మునిసిపాలిటీలో 176 మంది కాంట్రాక్టు కార్మికులు, 13 మంది ఎస్ ఎంఆర్ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు వాటర్ సప్లయ్, విద్యుత్ విభాగాల్లో కొందరు కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి మే నెల నుంచి వేతనాలు అందలేదు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పిల్లల చదు వులు, నిత్యావసర సరుకులు ఇతర అవసరాల కోసం చేతిలో చిల్లిగవ్వలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ముక్కుపుటాలు అదిరే విధంగా దుర్గంధభరిత వాసనలు వెదజల్లుతున్నా మురికి కాల్వలను శుభ్రం చేయడం, రోడ్లపై చెత్తచెదారం లేకుండా శుభ్రం చేసే పనులు చేసే కార్మికుల కుటుం బాలు వేతనాలు అందక అర్ధాకలితో అలమటించే పరిస్థితులను ఎదుర్కొంటు న్నారు. రెండు నెలలుగా వేతనాలు రాక కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొం టున్నా మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించు కోవడం లేదు. సఫాయన్నా నీకు సలాం అన్నా అని పొగడ్తలు గుప్పించే ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి.

రెండు నెలలుగా 189 మంది కార్మికులకు అందని వేతనాలు

నర్సంపేట మునిసిపాలిటీలో పని చే స్తున్న 176 మంది కాంట్రాక్టు, 13మంది ఎస్ఎంఆర్ కార్మికులకు మే, జూన్ నెలలకు సంబంధించి రెండు నెలల జీతం రాక కార్మికులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒక్కో కాంట్రాక్టు కార్మికుడికి రూ:16,500, ఎస్ఎంఆర్ కార్మికులకు రూ: 20వేల వేతనం అందిస్తున్నారు. ఇందులో పీఎఫ్ ఇతర కటింగులు పోను రూ:15 వేల నుంచి 18వేల వరకే అందుతున్నట్లు తెలిసింది. పెరిగిన ధరల కనుగుణంగా వేతనాలు అందక కార్మికులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీత ంగాఉ న్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు రెండునెలల వేతనం అందించాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీకాంత్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీకాంత్

వర్ధన్నపేట రూరల్, జూలై 10 : మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ బుధవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలోని యువజన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా చొరవ చూపాలని కోరారు.

పోస్టల్ ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలి



నర్సంపేట పోస్టాఫీసులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

నర్సంపేట, జూలై 10 : పోస్టల్ ప్రమాద బీమా పాలసీలను ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అధికారి సంపత్ మాట్లాడుతూ పోస్టల్ పేమెంట్ బ్యాంక్‌లో అనేక రకాల ప్రమాద బీమా పాలసీలు ఉన్నాయన్నారు. రూ.520లకు రూ.10లక్షల ప్రమాద బీమా, రూ:720లకు రూ.15లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. ప్రజలు అందుబాటులో ఉన్న పోస్టాఫీసుల్లో ఈ సౌక ర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుచేంద్ర, సబ్‌పోస్టు మాస్టర్ దార్ల రాజేందర్, సునీత, పోస్టల్ అసిస్టెంట్స్ రాజన్, సిబ్బంది అశోక్, వీరభ ద్రయ్య, సురేష్, శ్రీకాంత్, అశోక్, అనూష, కృష్ణకిషోర్, రాజశేఖర్ పాల్గొన్నారు.